# ముస్లింలకు రిజర్వేషన్లు సబబే

ముస్లింలకు విద్యా ఉద్యోగ రంగాలలో 5 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జివొ 33ను వెనక్కి తీసుకోవాలంటూ కొన్నివర్గాల వారు ఆందోళన చేస్తున్నారు. బిజెపివారు బహిరంగంగా అల్లరిచేయగా, ఇతరులు తగ్గు స్థాయిలో అదే డిమాండ్ చేస్తున్నారు.

ఈ వ్యతిరేకత ఎంతవరకు సబబు అనేది చర్చించుకోవలసిన విషయం. సామాజిక వాస్తవాలేమిటి, రాజ్యాంగమేమంటుంది, న్యాయస్థానాలు ఏమన్నాయి మొదలయిన విషయాలు అందరం తెలుసుకోవాలి. విషయాలు తెలుసుకోకపోతే ఆవేశానికి కొట్టుకుపోయే ప్రమాదం ఉంది.

సామాజిక వాస్తవాల గురించి పెద్దగా వివాదం లేదు. జివొ 33ను వ్యతిరేకిస్తున్నవారెవ్వరూ ముస్లింలలో వెనుకబాటుతనం లేదని అనడంలేదు. హైకోర్టులో వేసిన కేసులలో సహితం, ముస్లింలు అభివృద్ధి చెందిపోయారు కదా, వారికి రిజర్వేషన్లు ఎందుకు అని ఏ ఒక్కరూ అనలేదు. ముస్లింలలో ఉందని ప్రభుత్వం చెప్తున్న వెనుకబాటుతనం నిజంగానే ఉందని అందరూ ఒప్పుకుంటున్నారు. అయినప్పటికీ వారికి రిజర్వేషన్లు ఇయ్యొద్దని వారి వాదన.

జివొ 33కు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళన గురించి తెలుసుకోవలసిన మొట్టమొదటి విషయం ఇది.

మరయితే ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? మతం ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వడాన్ని రాజ్యాంగం ఒప్పుకోదనీ, అది సామాజికంగా హానికరమనీ, సమాజాన్ని నిలువునా చీలుస్తుందనీ అంటున్నారు.

రాజ్యాంగం సంగతి మొదట చెప్పుకుందాం. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం వారికి ప్రత్యేక సదుపాయాలు కల్పించవచ్చుననీ, ప్రభుత్వ ఉద్యోగాలలో తగిన ప్రాతినిధ్యం లేని వెనుకబడిన వర్గాలకు ఆ ఉద్యోగాలలో రిజర్వేషన్ ఇయ్యవచ్చుననీ రాజ్యాంగం అంటుంది.

ఒక కులం సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉన్నట్టయితే ఆ కులాన్ని వెనుకబడిన వర్గంగా గుర్తించి రిజర్వేషన్లు ఇయ్యడంలో తప్పేమీ లేదని సుప్రీంకోర్టు నలభై ఏళ్లుగా అనేక తీర్పులలో అనింది. ఈ కేసులన్నీ బిసిలకు రిజర్వేషన్లు ఇవ్వడాన్ని సవాలుచేస్తూ అగ్రకులాలు వేసినవే. అప్పుడూ వారు ఇదే వాదన చేశారు. ఈరోజు మతం పేరుమీద చేస్తున్న వాదన ఆరోజు కులం పేరుమీద చేశారు. కులం ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వడాన్ని రాజ్యాంగం ఒప్పుకోదన్నారు. దానికి సుప్రీంకోర్టు ఏం సమాధానం చెప్పిందంటే సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉన్న కులానికి రిజర్వేషన్లు కల్పించడం 'కులం' ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇచ్చినట్టు కాదనింది. ఆ కులాన్ని వెనుకబడిన వర్గంగా దానికి రిజర్వేషన్ ఇస్తున్నారే తప్ప కులానికి రిజర్వేషన్ ఇవ్వడంలేదనింది.

ఏదయినా ఒక ప్రజాసమూహం వెనుకబడి ఉన్నట్టయితే వారికి రిజర్వేషన్ కల్పించవచ్చు. ఆ సమూహం ఒక కులం కావచ్చు, ఒక ప్రాంతవాసులు కావచ్చు, ఒక భాష మాట్లాడేవారు కావచ్చు. దీని అర్థం కులానికో, ప్రాంతానికో, భాషకో రిజర్వేషన్ ఇచ్చినట్టు కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ మాట అంటూ, 'ఒకవేళ ముస్లింలు వెనుకబడి ఉన్నారని ఒక రాష్ట్ర ప్రభుత్వం గుర్తించినట్టయితే ముస్లింలకు రిజర్వేషన్ ఇయ్యవచ్చు' అని కూడా మండల్ కమిషన్ కేసులో రాజ్యాంగ ధర్మాసనం అనింది. మన రాష్ట్రంలో ముస్లింలు వెనుకబడి ఉన్నారన్న వాస్తవాన్ని ఎవరూ కాదననప్పుడు 'రాజ్యాంగం ఒప్పుకోదు' అన్న వాదన చెల్లదని దీనినిబట్టి స్పష్టం అవుతున్నది.

ముస్లింలకు రిజర్వేషన్ ఇవ్వడం సమాజాన్ని నిలువునా చీల్చడమేనన్న వాదనను ఏవిధంగా అర్థం చేసుకోవాలి? హిందువులు, ముస్లింలు అన్న చీలిక మన సమాజంలో చాలాకాలంగా ఉంది. దానికి చారిత్రక, రాజకీయ కారణాలున్నాయి. ముస్లింలకు ఇచ్చే రిజర్వేషన్ల పట్ల హిందువులు కోపగించు కున్నట్టయితే ఈ ఎడం మరింత పెరుగుతుందిగానీ, సహృదయంగా అర్థం చేసుకుంటే ఎందుకు పెరుగుతుంది?

సహృదయంగా ఎందుకు స్పందించాలి అని అడుగుతారేమో. దీనికి జవాబు క్లుప్తంగానే అయినా జివొ 33లో ప్రభుత్వమే చెప్పింది. రాష్ట్రంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారి సంఖ్య 30 శాతం కాగా, ముస్లింలలో 65 శాతం. రాష్ట్రంలో నిరక్షరాస్యత 56 శాతం కాగా ముస్లింలలో 82 శాతం. ముస్లిం స్త్రీలలోనయితే 96 శాతం. రాష్ట్ర జనాభాలో ముస్లింలు 8.5 శాతం ఉన్నారుగానీ ప్రభుత్వ ఉద్యోగాలలో అందులో సగం కూడా లేరు. అత్యధికులు అసంఘటిత రంగంలోని చిన్న వృత్తులలో మగ్గుతున్నారు. పాన్‌షాపులు, చాయ్ దుకాణాలు, పూలు, పళ్ళ దుకాణాలు, రేడియో రిపైర్, వాచ్ రిపైర్ షాపులు పెట్టుకొని బతుకుతున్నారు. మెకానిక్ షెడ్‌లలో హోటళ్ళలో పనిచేస్తున్నారు. గ్రామీణ చేతివృత్తుల రంగంలో ఉన్నారు.

> **ముస్లింల ప్రస్తావన వచ్చినప్పుడు మన సైకిల్‌కు గాలికొట్టే అహమ్మదు, మన వీధి చివర చాయ్ అమ్మే బాషా, మన పక్కింట్లో కసుపు ఊడ్చే సుల్తాన్‌బీ జ్ఞాపకం రారు. ఒసామాబిన్ లాడెన్‌ను తలచుకుంటాం, జైష్-ఇ-మహమ్మద్‌ను, లష్కర్-ఇ-తయ్యబాను తలచుకుంటాం. దీనికి తగ్గట్టు స్పందిస్తాం. అప్పుడు ముస్లింలకు ప్రభుత్వం ఏ మేలు చేయజూసినా అది భయంకరమైన తప్పిదంగా కనిపిస్తుంది.**

రాష్ట్రంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారి సంఖ్య 30 శాతం కాగా, ముస్లింలలో 65 శాతం. రాష్ట్రంలో నిరక్షరాస్యత 56 శాతం కాగా ముస్లింలలో 82 శాతం. ముస్లిం స్త్రీలలోనయితే 96 శాతం. రాష్ట్ర జనాభాలో ముస్లింలు 8.5 శాతం ఉన్నారుగానీ ప్రభుత్వ ఉద్యోగాలలో అందులో సగం కూడా లేరు. అత్యధికులు అసంఘటిత రంగంలోని చిన్న వృత్తులలో మగ్గుతున్నారు. పాన్‌షాపులు, చాయ్ దుకాణాలు, పూలు, పళ్ల దుకాణాలు, రేడియో రిపేర్, వాచ్ రిపేర్ షాపులు పెట్టుకొని బతుకుతున్నారు. మెకానిక్ షెడ్‌లలో హోటళ్లలో పనిచేస్తున్నారు. గ్రామీణ చేతివృత్తుల రంగంలో ఉన్నారు.

ఇటువంటి ప్రజా సమూహానికి రిజర్వేషన్లు ఇస్తే ఇతర ప్రజలు సానుభూతితో ఎందుకు అర్థం చేసుకోకూడదు? చేసుకున్నట్టయితే సమాజంలో చీలిక ఎందుకు పెరుగుతుంది? అయినా ముస్లిమేతరులు సానుభూతితో అర్థం చేసుకోరని ప్రకటించడానికి ఈ పిడికెడు మంది ఆందోళనకారులకు ఎవరు అధికారం ఇచ్చారు?

ముస్లింలకు 5 శాతం రిజర్వేషన్ ఇచ్చినట్టయితే మొత్తం రిజర్వేషన్ 50 శాతం దాటిపోతుందనేది దానిని వ్యతిరేకిస్తున్నవారు చెప్తున్న మరొక కారణం. మొత్తం రిజర్వేషన్ 50 శాతం దాటడానికి వీలులేదని సుప్రీంకోర్టు చెప్పిందని వారు అంటున్నారు.

ఇదెంతవరకు నిజం?

మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించవచ్చునా లేదా అన్న విషయంలో సుప్రీంకోర్టు జడ్జిలు గడచిన 50 ఏళ్లలో తలా ఒక అభిప్రాయం వ్యక్తం చేశారు. వెనుకబాటుతనం ఎంత ఉంటే రిజర్వేషన్ అంత ఉంటుంది – దానికి సీలింగ్ ఏమిటి అన్నవారూ ఉన్నారు. మొత్తం రిజర్వేషన్ ఎట్టి పరిస్థితిలోనూ 50 శాతం మించడానికి వీలులేదన్నవారూ ఉన్నారు. ప్రస్తుతం శిరోధార్యంగా ఉన్నది మండల్ కమిషన్ కేసులో మెజారిటీ తరపున తీర్పు ప్రకటించిన జస్టిస్ జీవన్‌రెడ్డి అభిప్రాయం. అదేమిటంటే, వెనుకబడిన వర్గాలకు ఇచ్చే రిజర్వేషన్ మొత్తం 50 శాతం మించకూడదన్నది ఒక స్థూలమయిన నియమం. దానికి ప్రత్యేక పరిస్థితులలో మినహాయింపులుండగలవు. అంతేకాక, వెనుకబడిన వర్గమన్న కారణంగా కాక వేరే కారణాల వల్ల ఇచ్చే రిజర్వేషన్‌కు ఈ '50 శాతం సీలింగ్' వర్తించదు. ముల్కీ తరహా లోకల్ రిజర్వేషన్లు, స్త్రీలకు ఇచ్చే 33.3 శాతం రిజర్వేషను, వికలాంగులకిచ్చే 3 శాతం రిజర్వేషను, ఎన్‌సిసి కోటా, స్పోర్ట్స్ కోటా మొదలైనవి ఈ సీలింగ్‌కు వెలుపల ఉంటాయి.

'50 శాతం సీలింగ్' వర్తించేది ఎస్‌సి, ఎస్‌టి, బిసి రిజర్వేషన్లకే. అవి మూడూ కలిపి ప్రస్తుతం 46 శాతం ఉన్నాయి. ముస్లింను బిసిలలో చేర్చి 5 శాతం రిజర్వేషన్ ఇస్తే ఇది 51 శాతం అవుతుంది. అంటే 'స్థూలమైన' పరిమితిని మించి ఒకశాతం మాత్రమే అవుతుంది. ఆ ఇంత కూడా మించవద్దనుకుంటే 5 శాతాన్ని 4 శాతానికి తగ్గిస్తూ జివొ 33ను సవరించవచ్చును. అప్పుడు దానిని వ్యతిరేకిస్తున్నవారు తమ వ్యతిరేకతను మానుకుంటారా? ముస్లింలలో (ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో) ధనికవర్గం కూడా ఒకటి ఉన్నదనీ, ముస్లింల పేరుమీద ఇచ్చే రిజర్వేషన్ యావత్తూ వారే తన్నుకు పోతారనీ కూడా వాదిస్తున్నారు. బిసి రిజర్వేషన్ విషయంలో అగ్రకులాలవారు ఇదే అభ్యంతరం వ్యక్తంచేయగా, మండల్ కమిషన్ కేసులో సుప్రీంకోర్టు ఏమనిందంటే ప్రతీ బిసి కులంలోనూ 'క్రీమీ లేయర్'ను గుర్తించి రిజర్వేషన్ల పరిధి నుంచి వారిని తొలగించాలని. ముస్లింలను ఇప్పుడు ఒక బిసి వర్గంగా గుర్తించి రిజర్వేషన్ ఇస్తున్నారు కాబట్టి అది జివొ 33కు కూడా వర్తిస్తుంది. మన రాష్ట్రంలో 'క్రీమీ లేయర్' గుర్తింపుకు ప్రమాణాలింకా ప్రభుత్వం రూపొందించలేదు. ఏ ప్రమాణాలు రూపొందించినా అవి ముస్లింలకు కూడా వర్తిస్తాయి. కాబట్టి నిజాం మనవలే రిజర్వేషన్ మొత్తం కొట్టేస్తారని ఆందోళన చెందనక్కరలేదు.

ఇవికాక వేరే సాంకేతిక కారణాలు కూడా చెప్తున్నారు. వాటికి సామాజిక ప్రాముఖ్యం గానీ, రాజ్యాంగపరమైన ప్రాముఖ్యంగానీ ఏమీ లేదు కాబట్టి వాటినిక్కడ చర్చించనక్కరలేదు. ఒకవేళ ఏదో ఒక సాంకేతిక కారణం వల్ల జివొ 33 చెల్లదని రేపు హైకోర్టు తప్పుపట్టినా దానిని సవరించి మళ్లీ జారీచేయవచ్చు. అంతే తప్ప జివొ 33 చెల్లదనడానికి సామాజిక కారణంగానీ, రాజ్యాంగపరమైన అవరోధంగానీ ఏమీ లేదు.

దురదృష్టకరమైన విషయం ఏమిటంటే ముస్లింలకూ ఇస్లాంకూ సంబంధించిన విషయాలను హేతుబద్ధంగా, స్థిమితమైన మనస్సుతో చర్చించడం సాధ్యంకాని కలుషిత వాతావరణం దేశంలో నెలకొని ఉంది. దీనికి బాధ్యులెవరు అన్న చర్చ ఇక్కడ అప్రస్తుతంగానీ దీనిని తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నవారెవరో స్పష్టంగానే చూస్తున్నాం.

ఈ వాతావరణం కారణంగా ముస్లింల ప్రస్తావన వచ్చినప్పుడు మన సైకిల్‌కు గాలికొట్టే అహమ్మదు, మన వీధి చివర చాయ్ అమ్మే బాషా, మన పక్కింట్లో కసువు ఊడ్చే సుల్తాన్‌బీ జ్ఞాపకం రారు. ఒసామాబిన్ లాడెన్‌ను తలచుకుంటాం, జైష్-ఇ-మహమ్మద్‌ను, లష్కర్-ఇ-తయ్యిబాను తలచుకుంటాం. దీనికి తగ్గట్టు స్పందిస్తాం. అప్పుడు ముస్లింలకు ప్రభుత్వం ఏ మేలు చేయజూసినా అది భయంకరమైన తప్పిదంగా కనిపిస్తుంది.

అమానవీయమైన ఈ మానసిక స్థితిని అధిగమించాలేగానీ జివొ 33లో తప్పేమీ లేదనీ, అది నిజానికి సామాజిక న్యాయానికి చాలా అవసరమైన చర్య అనీ గుర్తించడానికి ఎంతోసేపు పట్టదు.

**5 ఆగస్టు 2004**

హైదరాబాద్

మానవహక్కుల వేదిక

**Human Rights Forum**